టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడిగా మెరుగు చంద్రమోహన్



కుషాయిగూడ: తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్(టీఎస్‌జేయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా కాప్రాకు చెందిన మెరుగు చంద్రమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయన నియామకంపై టీఎస్‌జేయూ జిల్లా నాయకులు ముత్యం ముఖేష్‌గౌడ్, చాప రవీందర్, దూసరి రవీందర్, అంజనేయులు, సదానందం, శ్రీధర్, విష్ణుమోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, విద్యా, వైద్యం వంటి అంశాలపై దృష్టి సారించి సాధించుకునే దిశగా కార్యాచరణ చేపట్టి ముందుకు సాగుతానన్నారు.

న్యాయం చేస్తారా.. ఉరివేస్తారా?



నినాదాలు చేస్తున్న బాధితులు

పంజగుట్ట: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తమకు పట్టాలు మంజూరు చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమ ఇళ్లు కూల్చేసి తమ నోట్లో మట్టి కొట్టిందని సాయి ప్రియనగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జీవో నంబర్–118 ప్రకారం తమ స్థలాలు రెగ్యులరైజ్ చేయాలని, లేనిపక్షంలో ఉరివేసి మా ప్రాణాలు తీయాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాయిప్రియ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు నారగోని ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు సీహెచ్.మహేందర్, బాధితులు లక్ష్మి, ఉజ్వల తమ గోడు వెళ్లబోసుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపాలిటీ, మేడిపల్లి మండలం, పర్వతాపూర్‌లో సాయి ప్రియనగర్‌లో ఒక్కో పైసా కూడబెట్టుకుని ప్రతినెలా కిస్తీ కడుతూ 350 మంది సుమారు 16 ఎకరాల్లో ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ఆ ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ ఉందని, కొన్ని ప్లాట్లకు మున్సిపల్ పర్మిషన్, గ్రామపంచాయతీ అనుమతి ఉందని, కరెంటు బిల్లులు, ఇంటి నంబర్లు ఉన్నాయని, ఇవి ఇచ్చేముందు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇది ప్రభుత్వ స్థలమని తమను ఇబ్బంది పెట్టేందుకు చూస్తే తాము తీవ్రంగా వ్యతిరేకించడంతో బీఆర్‌ఎస్ నాయకులు దిగివచ్చి జీవో 118 కింద రెగ్యులరైజ్ చేసుకోవచ్చని చెప్పడంతో అందరం జీవో 118 కింద దరఖాస్తు చేసుకుని, రుసుము కట్టామని తెలిపారు. తమ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా అప్పటికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, దీంతో తాము ప్రజావాణిలో సమస్య చెప్పుకున్నామని తెలిపారు. ప్రజావాణిలో తమ సమస్య చెప్పుకోవడమే పాపమైందని, వెంటనే అధికారులు వచ్చి స్థలాలు స్వాధీనం చేసుకున్నారని, ఉన్న నిర్మాణాలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ స్థలాలు తమకు అప్పగించకపోతే తమకు ప్రభుత్వమే ఉరివేసి చంపాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే ప్రజాభవన్, గాంధీభవన్ ముట్టడిస్తామని, ఇందిరాపార్క్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.57 లక్షల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు మంగళవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. నెహ్రూనగర్ కాలనీ బ్లాక్–2లో రూ.10 లక్షలతో డ్రైనేజీ, సూర్యనగర్‌కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, ఓల్డ్ మల్లాపూర్ పీర్లకొట్టం వద్ద రూ.27 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లను వేయిస్తున్నామన్నారు. డీఈ రూప, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం రూ.47 కోట్లు.. బకాయిలు రూ.100 కోట్లు

31లోపు చెల్లించిన వారికి పెనాల్టీలో 90 శాతం రద్దు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను బకాయి ఉన్న వారు ఈ నెల 31లోపు చెల్లించాలని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. మీ ప్రాంతంలో మరిన్ని సదుపాయాలు కల్పించాలంటే స్థిరాస్థి వ్యాపారులు వెంటనే బకాయిలను చెల్లించాలన్నారు. ఈ నెల 31లోపు చెల్లించిన వారిగా పెనాల్టీలో 90 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గతేడాది రూ.34.46 కోట్ల వరకు వసూలు చేశామని, ఈ సంవత్సరం దాదాపు రూ.47 కోట్ల వరకు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే రూ.26 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయన్నారు. ఇప్పటికి ఉప్పల్ సర్కిల్ పరిధిలో దాదాపు రూ.100 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలిపారు.

శానిటేషన్ అడహక్ కమిటీ సభ్యుడిగా శ్రవణ్

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ శానిటేషన్, ప్రకటనలకు సంబంధించి ఏర్పాటు చేసిన అడహక్ కమిటీలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కు చోటు లభించింది. శ్రవణ్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో మెరుగైన శానిటేషన్ వ్యవస్థతో పాటు ప్రకటనలకు సంబంధించి సూచనలు ఇస్తానన్నారు.

విద్యార్థికి చేయూత

మేడిపల్లి: నిరుపేద విద్యార్థిని పైచదువులకు పీర్జాదిగూడ నగర మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థిని మనీష తల్లిదండ్రులు డి.వెంకటేష్, పద్మకు ఆమెను చదివించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువును మధ్యలోనే ఆపేశారు. మిత్రుల ద్వారా విషయం తెలుసుకున్న మేయర్ మనీషాకు రూ.50వేల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. కార్పొరేటర్లు కొడె పోచయ్య, ఎంపాల అనంతరెడ్డి, సుభాష్ నాయక్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, బైటింటి ఈశ్వర్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జావీద్ ఖాన్, సత్యనారాయణ ఉన్నారు.

సైన్స్‌తోనే మానవ జీవన గమనం



సైన్స్ ఫెయిర్‌లో ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్

మల్లాపూర్: సైన్స్‌తోనే మానవ జీవన గమనమని హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ భవానీనగర్‌లోని సప్రాస హైస్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుంకర నరేష్ మాట్లాడారు. అంతర్జాతీయ పరిశోధనల కోసం దేశం ఎదురు చుస్తోందన్నారు. విద్యార్థులు స్వయంగా నమూనాలు తయారు చేసి ప్రదర్శించినందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నరేంద్రబాబు, డైరెక్టర్ గిరిధర్, సందీప్, ప్రిన్సిపల్ వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేల ఆధునీకరణ ప్రశంసనీయం

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: దేశంలో రైల్వేల ఆధునీకరణ ప్రశంసనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వ గ్యారంటీ భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్లతో చేపట్టనున్న రైల్వే ఆధునీకరణ పనులను మంగళవారం గుజరాత్ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చర్లపల్లి, మల్లాపూర్ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆధునీకరణలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలోని చర్లపల్లి రైల్వే టెర్మినల్ ఆధునిక హంగులతో రూపాంతరం చెందడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఎం శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ దిలీప్‌కుమార్, ఏకే సిన్హా, విజయ్‌కుమార్, చర్లపల్లి రైల్వే టర్మినల్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యులు నాదం, కొమ్ము నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, చల్లా ప్రభాకర్, నాగమణితో పాటు స్థానిక నేతలు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్ వంశరాజ్, దప్పు గిరిబాబు, నాగిళ్ల బాల్‌రెడ్డి, జౌండ్ల సత్తిరెడ్డి, ఆల్వా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేద్దాం



జ్యోతి ప్రజ్వలనలో రామలింగేశ్వర్‌రావు

బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేద్దామని ఉమ్మడి ఏపీ మాజీ హైకోర్టు జడ్జి ఎ.రామలింగేశ్వర్ రావు అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా చిన్నతనం నుంచి విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ మాట్లాడుతూ విశాలమైన ఆట స్థలం, చక్కటి వాతావరణం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యాబోధన చేస్తున్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలను అభినందించారు. చదువులతో పాటు అన్ని రకాల క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్న గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, పాఠశాల డైరెక్టర్లు శ్రావణ్ కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్, వరప్రసాద్, డాక్టర్ కిశోర్‌కుమార్, లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



కృష్ణానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కృష్ణానగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. డివిజన్ వ్యాప్తంగా సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టాల్సిన కాలనీలను గుర్తించామని, దశలవారీగా అన్ని కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, స్థానికులు మల్లారెడ్డి, అంజయ్యగౌడ్, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, రాజు, చారి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

14వ వసంతంలోకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత తడక జగదీశ్వర్‌గుప్తా

అల్వాల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. అనంతరం అన్నదానంతో పాటు పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు సుంకర రమేష్, ఎం.వెంకట్రావు, ప్రసాద్‌రావు, రామలింగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, డేనియల్, విజయ్, రాజు ఉన్నారు.

దశలవారీగా మౌలిక వసతులు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

బోడుప్పల్: దశలవారీగా అన్ని డివిజన్లల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 10వ డివిజన్‌లో రూ.21 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ బాలయ్య, మహేశ్వరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కు కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్కే హెచ్ కాలనీలోని పార్క్ కబ్జా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్కు స్థలంలో కబ్జాచేసి ఇళ్లు కడుతున్నవారిని ఆమె కాలనీవాసులతో కలిసి అడ్డుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొంతమంది గుండాలను పెట్టి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని, వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పార్క్ స్థలాన్ని కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్

యువకుడికి రెండు రోజుల జైలు

అల్వాల్: మద్యం మత్తులో అర్ధరాత్రి రోడ్డుపై తిరుగుతూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుడికి మల్కాజిగిరి న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించింది. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లో నివాసముండే తులసి పవన్‌కుమార్(23) ఈ నెల 11వ తేదీన వినాయక్‌నగర్‌లో గొడవ చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లగా మద్యం మత్తులో పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు తులసి పవన్‌కుమార్‌ను ఆరెస్టు చేసి మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించింది.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మల్కాజిగిరి: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కృష్ణమల్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మల్కాపురంకు చెందిన గుగులోతు శరత్‌చంద్ర(32) సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. కొన్ని నెలలుగా రేషన్ బియ్యాన్ని సేకరించి అధిక ధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున నర్సింహారెడ్డినగర్ వద్ద గూడ్స్ క్యారేజీ ఆటోలో సుమారు 12 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆస్పత్రిలో యువకుడి ఆత్మహత్య

అల్వాల్: విధులు నిర్వర్తిస్తున్న ఆస్పత్రిలోనే ఓ యువకుడు అనుమానస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటకు చెందిన రాము(27) కొన్నేళ్లుగా అల్వాల్‌లోని జీఎస్‌ఆర్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్. అల్వాల్ పట్టణ పరిధిలోని కానాజీగూడ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. కొంతకాలంగా రాము మానసిక ఒత్తిడితో ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. ఆసుపత్రిలో పని వేళలతో పాటు ఇతర కారణాల వల్ల అతను శారీరకంగా ఇబ్బందులను ఎదుర్కొంటూనే మానసిక ఒత్తిడికి గురయ్యేవాడని వెల్లడించారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత రాము తనకు తానుగానే గుర్తు తెలియని ఇంజక్షన్ తీసుకున్నాడని, దీంతో వైద్యం వికటించి అతడు మృతి చెందాడంటూ ఆసుపత్రి వర్గాలు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ ఓసారి ఈ విధంగా రాము వ్యవహరించడం జరిగిందని ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు. ఉద్యోగం మానేసే క్రమంలో యాజమాన్యం నుంచి ఉద్యోగ సంబంధిత ధ్రువపత్రం కోరగా ఇవ్వకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఆరోపించారు. ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులను సముదాయించిన అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలాలి దర్గా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

అల్వాల్: మౌలాలి హజ్రత్ కొహి మౌలాలి దర్గా భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెందితో పాటు ప్రాజెక్టు సి.ఇ.దేవానంద్, ఎస్ఈ రవీందర్‌రాజు, జోనల్ కమిషనర్‌తో కలిసి దర్గా అభివృద్ధి పనులు పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ద్వారా దర్గా అభివృద్ధి పనులను రెండు దశల్లో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దర్గాకు వచ్చే భక్తుల కోసం రోడ్డు, మిడిల్ ల్యాండింగ్ వాహనాలను నిలిపేందుకు వెయ్యి చదరపు మీటర్ల పార్కింగ్ పూర్తి చేశామని, రెండో దశలో రిటైనింగ్ వాల్‌తో పాటు రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టామన్నారు.

త్వరితగతిన రోడ్డును విస్తరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ నుంచి మణిక్ చంద్ చౌరస్తా వరకు 66 ఫీట్ల రోడ్డును త్వరితగతిన విస్తరించాలని కోరుతూ మంగళవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మల్లాపూర్ శివహోటల్ నుంచి జేఎస్ఎస్‌యూఆర్ఎం వరకు కూడా రోడ్డును విస్తరించాలని గతంలోనే జీహెచ్‌ఎంసీలో తీర్మానించామని కమిషనర్‌కు గుర్తు చేశారు. రోడ్డు వెడల్పులో దాదాపు 244 ఇళ్లు కోల్పోతున్నాయని, గతంలోనే అధికారులు గుర్తించినట్లు కమిషనర్‌తో పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్‌ఎస్ నేతలు సాయి జెనోఖర్, బన్నాల ప్రవీణ్, మహేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మేళా శ్యామ్‌కా కార్యక్రమానికి ఆహ్వానం

అల్వాల్: బన్సల్ పరివార్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన కొంపల్లిలోని శ్రీకన్వెన్షన్‌లో నిర్వహించనున్న మేళా శ్యామ్‌కా కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డిని బన్సల్ పరివార్ ప్రతినిధులు సుభాష్ బన్సల్, ముఖేష్ మన్సల్‌లు మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని మేళా కార్యక్రమానికి ఆహ్వానించామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో పాటు ప్రముఖులను ఆహ్వానించినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న సుప్రభాతం నాటిక

మల్లాపూర్: తెలంగాణ చలన చిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ సౌజన్యం, రిషాన్ సాహిత్య, సాంస్కృతిక ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ నెహ్రూనగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద సందేశాత్మక నాటిక సుప్రభాతం ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా రంగస్థల నటులు డాక్టర్ ఓలేటి శ్రీనివాసాచార్య, సినీనిర్మాత నెహ్రూ, ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణ, సినీదర్శకులు రాంప్రసాద్ హాజరయ్యారు. ప్రముఖ రంగస్థల సినీ టీవీ నటులు ఐరేని రమేష్‌గౌడ్ మాడుగుల కృష్ణమోహన్, నటీమణి మనుప్రియ, జంగయ్యగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యం వెలికి తీయాలి

రామంతాపూర్: శ్రీనగర్ కాలనీలోని ఎస్వీ గ్రామర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మంగళవారం కార్పొరేటర్లు శ్రీవాణి వెంకట్‌రావు, చేతన హరీష్ ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యం, ప్రతిభ దాగి ఉంటాయని, వాటిని వెలికి తీయడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వసుంధర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని మల్కాజిగిరి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గుండా నిరంజన్ అన్నారు. మున్నూరు కాపు కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మున్నూరు కాపు కులస్తుల కల నెరవేరిందని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్న నమ్మకం కలిగిందన్నారు.